పాడి రైతుల సంక్షేమానికి కృషి

ఆగిరిపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పాడి రైతుల సంక్షేమాభివృద్ధి కోసం ఎనలేని చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలంలో రూ.2.30 లక్షల ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. పశు పోషకులందరూ తప్పనిసరిగా మినీ గోకులం పతకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి

బరులు రె'ఢీ'..!

పోలీసుల ఉత్తుత్తి చర్యలపై
అంతా పెదవి విరుపు
కోడిపందేలకు పందేలరాయుళ్లు సర్వం సన్నద్ధం
ఊరూవాడా.. ముమ్మరంగా బరుల ఏర్పాట్లు
బరులు ప్రాతిపదికన పోలీసులకు మామూళ్లు అంటూ ప్రచారం
గతానికి భిన్నంగా ఈ సారి నెల రోజుల నుంచే పందేల జోరు
భోగి రోజు నుంచి మరింత పెరిగే అవకాశం
కోర్టు ఆదేశాలు ఈ ఏడాది బేఖాతర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

హైకోర్టు ఆదేశాలను తుంగలోతొక్కి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ముమ్మరంగా కోడిపందేల బరుల ఏర్పాటు జరుగుతోంది. గతేడాది కంటే ఈసారి పెద్దఎత్తున పందేలు నిర్వహించేందుకు పందెం రాయుళ్ల సర్వం సన్నద్ధం చేసుకున్నారు. ఏటా మాదిరిగా పోలీసుల ఉత్తుత్తి చర్యలపై జనాలు నవ్వుకుంటున్న పరిస్థితి నెలకొంది. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది గడిచిన నెల రోజులు కోడిపందేల జోరు కొనసాగుతోంది. ఇక పండుగ మూడు రోజులు అనధికార ఆదేశాలతో విచ్చలవిడిగా పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 13వ తేదీ భోగి రోజు పందేల జోరు ప్రారంభం కానుంది. రెండు జిల్లాల్లో దాదాపు 400లకు పైగా కోడిపందేల బరులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. పందేలరాయుళ్ల అందుకు సంబంధించి ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ముదినేపల్లి, కొయ్యలగూడెం, పెదవేగి, కాళ్ల, ఆకివీడు వంటి అనేక మండలాల్లో శనివారమే కోడిపందేల బరులు సిద్ధమైన పరిస్థితి నెలకొంది. బరులను ట్రాక్టర్లతో చదును చేసి టెంట్ల ఏర్పాటుకు ముమ్మరంగా పనులు సాగిస్తున్నారు. ఏటా మాదిరిగానే పోలీసులు ఈ సారి కూడా బరులు ధ్వంసం చేస్తున్నట్లు హడావుడీ చేయడం ప్రారంభించారు. బైండోవర్ కేసులు, బరులను ధ్వంసం చేస్తున్నట్లు ఫొటోలు వంటివి తీసుకుని కోర్టు నుంచి తప్పించుకునేందుకు పోలీసులు తమ ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. కోడిపందేలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నాయకులంతా కూటమి ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. దీంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఉండి నియోజకవర్గంలో గడిచిన నెలరోజులుగా కోడిపందేల జోరు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకున్న పాపానపోలేదు. దెందులూరు నియోజవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. పండుగ మూడు రోజుల్లో ప్రతి మండలంలోనూ కనీసంగా తక్కువగా లెక్కించిన చిన్నా, పెద్దా పది వరకూ కోడిపందేల బరులు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. రాత్రిపూట సైతం నిర్విరామంగా కొనసాగేందుకు ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పందేలరాయుళ్ల జిల్లాకు క్యూ కడుతున్న పరిస్థితి నెలకొంది.

కొయ్యలగూడెం రాజవరం గ్రామంలో సిద్ధమవుతున్న కోడిపందేల బరి

నామకహగా కమిటీల ఏర్పాటు..

కోడిపందేలను అడ్డుకునేందుకు కోర్టు ఆదేశాలతో ఏటా మండలాల వారీగా కమిటీల ఏర్పాటు జరుగుతోంది. ఈ ఏడాది సైతం ఏలూరు జిల్లాలో 28 కమిటీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఇటీవలే ప్రకటించారు. పశ్చిమలోనూ అదే పరిస్థితి. ఈ కమిటీలో మండలంలోని తహశీల్దార్, ఎస్ఐ, ఎన్‌జిఒ ప్రతినిధులు, కానిస్టేబుళ్ళ, ఇద్దరు వీడియో గ్రాఫర్లు ఉంటారు. మండలంలో ఎక్కడ కోడిపందేలు జరిగినా ఈ కమిటీలు ముందుగా గుర్తించి పోలీసులతో అడ్డుకోవాలి. ఏటా కమిటీలు ఏర్పాటు చేస్తున్నా కోడిపందేలు మాత్రం ఆగడం లేదు. నామకహగా ఏర్పాటు చేస్తున్న కమిటీలు ఎందుకన్న ప్రశ్నకు ఏ ఒక్కరి నుంచీ సమాధానం లేకుండా పోతోంది.

కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన బరి

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

కోడిపందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ నెల ఏడో తేదీన మరోసారి కోడిపందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పందేలను అడ్డుకునే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. రెండు జిల్లాల్లో కోడిపందేల బరుల ఏర్పాట్లు యథేచ్ఛగా సాగుతున్నాయి. కోర్టు ధిక్కరణ చర్యలను తప్పించుకునేందుకు అధికారులు ఉత్తుత్తి చర్యలు చేపడుతూ అందరినీ ఏమారుస్తున్న పరిస్థితి నెలకొంది. చట్టాలను తుంగలో తొక్కుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే కోడిపందాలకు అడ్డుకట్ట పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బరుల ప్రాతిపదికన మామూళ్లు

కోడిపందేలకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని తెలిపోవడంతో పోలీసులు, ఇతరులకు బరులు ప్రాతిపదికన మామూళ్లు ఇచ్చేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. చిన్న బరులకైతే రూ.50 వేలు, మోస్తారు, పెద్ద బరులకైతే రూ.లక్ష, బాగా పెద్దబరులకు రూ.నాలుగు లక్షల వరకూ మామూళ్లు ఇచ్చే విధంగా నిర్ణయిం జరిగినట్లు సమాచారం. పోలీసుల్లో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ ఈ మామూళ్ల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట, అనధికార మద్యం అమ్మకాలకు సైతం పండుగ మూడు రోజులు కొనసాగించేందుకు అవకాశం ఇస్తున్నట్లు చెబుతున్నారు. బరుల వద్ద జాతరను తలపించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోడిపందేలు, జూదం పేరుతో వసూలు చేస్తున్న డబ్బులతో గ్రామాల్లో పనులు చేస్తామంటూ కొంతమంది ప్రజాప్రతినిధులు చెబుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం జూద క్రీడలను ప్రోత్సహిస్తోందా అన్న చర్చ జనాల్లో సాగుతోంది.

కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల

2027 సెప్టెంబరుకు పోలవరం పూర్తి

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

2027 సెప్టెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయడు అన్నారు. శనివారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో మమేకమై ప్రాజెక్టు పనుల పురోభివృద్ధి సంబంధిత వివరాలు తెలిపిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ నిర్వాకం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 20 ఏళ్లపాటు వెనక్కి తీసుకుపోయిందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టు నిర్మాణంలో పనులు 72 శాతం పూర్తి చేసిందన్నారు. 18 నెలలపాటు కష్టపడి డయాఫ్రంవాల్ నిర్మిస్తే వైసిపి ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల డయాఫ్రంవాల్ ధ్వంసమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఐదేళ్ల పాలనలో ధ్వంసం చేసిన వైసిపికి పోలవరంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన గడువు ప్రకారం డయాఫ్రంవాల్ కాంక్రీట్ పనులు చేపడతామన్నారు. 2017 సంవత్సరంలో నిర్వాసితులకు అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు రూ.800 కోట్లు పరిహారం అందించారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన తక్కువ వ్యవధిలోనే మరో రూ.800 కోట్లకు పైగా నిధులు అందించింది చంద్రబాబేనన్నారు. గత వైసిపి పాలనలో నిర్వాసితులకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేకపోయారని, నిర్వాసితుల కాలనీల నిర్మాణం, బిల్లుల చెల్లింపులు జరగలేదన్నారు.

ప్రయాణ పాట్లు..!

పండుగ వేళ తగిన బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు - గంటల తరబడి పడిగాపులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా బస్సులు లేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేసి చూడాల్సి వస్తోంది. శుక్రవారం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో పాటు శనివారం నుంచి వరుసగా ఐదు రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సెలవులు రావడంతో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. అయితే ప్రయాణికులకు తగినట్లుగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేసి చూడాల్సి వస్తోంది. సంక్రాంతి సెలవుల్లో సాధారణంగా ఏలూరు, విజయవాడ నాన్‌స్టాప్ సర్వీస్‌లు ఎక్కువ రద్దీగా ఉన్న నేపథ్యంలో విజయవాడ నాన్ స్టాప్ సర్వీసులు పెంచారు. సాధారణ రోజుల్లో రోజుకు 85 ట్రిప్పులు ఉండే నాన్ స్టాప్ సర్వీసులను శుక్రవారం నుంచి మరో 25 ట్రిప్పులు పెంచారు. దీనికోసం పల్లె వెలుగు బస్సులను సైతం ఉపయోగిస్తుండడంతో మిగిలిన ప్రాంతాలకు బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో రాజమండ్రి, చింతలపూడి, తణుకు, నరసాపురం, భీమవరం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఏలూరు బస్టాండ్ నుంచి భీమవరం నరసాపురం వెళ్లే బస్సు కోసం శనివారం మధ్యాహ్నం ప్రయాణికులు సుమారు రెండు గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. రెండు గంటల తర్వాత బస్సు రావడంతో ప్రయాణికులు ఒక్కసారిగా బస్సులోకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో ఒక మహిళ కింద పడిపోయింది. సంక్రాంతి అంటేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలకే గాక ఇతర రాష్ట్రాల ప్రజలకు కూడా మొట్టమొదట గుర్తొచ్చే ఊరు పేరు భీమవరం అని, అలాంటి భీమవరానికి సంక్రాంతి సమయంలో బస్సులు లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ఒక భీమవరం బస్సులు మాత్రమే గాక అనేక బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. చాలా బస్సుల్లో ప్రయాణికులు నిలబడే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలతో ఉన్న మహిళలు, పురుషులతో పోటీపడి బస్సు ఎక్కలేక ప్రయాణికుల మధ్య నలిగిపోతూ నానా అవస్థలు పడుతున్నారు. అయితే విజయవాడ నాన్ స్టాప్ సర్వీసుల కోసం అధిక బస్సులు కేటాయించడం వల్లే ఈ పరిస్థితి రావడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క చూస్తే విజయవాడ వెళ్లేందుకు రెగ్యులర్‌గా ఉండే నాన్‌స్టాప్ బస్సులతో పాటు పల్లె వెలుగు బస్సులు కూడా చాలా వరకూ తక్కువ మంది ప్రయాణికులతో వెళ్తున్నాయి. నలుగురు, ఐదుగురు ప్రయాణికులతో కూడా విజయవాడకు బస్సులు బయలుదేరుతున్నాయి. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా విజయవాడ నుంచి ఏలూరు వచ్చేందుకు వందలాది ప్రయాణికులు విజయవాడ బస్టాండ్‌లో ఎదురుచూస్తున్నారని, ఇక్కడి నుంచి ఖాళీగా వెళ్లాల్సి వచ్చినా, విజయవాడ నుంచి ప్రయాణికులను ఏలూరు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ ఒక్క విజయవాడ మీదే అధికారులు దృష్టి కేంద్రీకరించకుండా మిగిలిన ప్రాంతాలకు వెళ్లే బస్సుల విషయంలో కూడా ప్రయాణికులు అసౌకర్యానికి గురవ్వకుండా చూడాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగ నేపథ్యంలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదో తేదీ నుంచి విద్యాసంస్థలకు సెలవులివ్వడంతో విద్యార్థులు, వారి కుటుంబాలతో సహా బంధువుల ఇళ్లకు పయనమయ్యారు. అయితే సరిపడా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండ్ల వద్ద వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. పండుగను ఆసరాగా చేసుకుని ప్రయివేటు ట్రావెల్స్ ఛార్జీల పేరుతో దోపిడీ చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సైతం ఎక్కువ మొత్తంలోనే ఛార్జీలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

ఉంగుటూరు : సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు కార్లలో వచ్చేవారితో జాతీయ రహదారి ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ముఖ్యంగా నారాయణపురం నుంచి భీమవరం వెళ్లే నారాయణపురం కూడలి వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు చేపట్టామని ఎస్ఐ సూర్య భగవాన్ పేర్కొన్నారు.

ఓబన్న సేవలు చిరస్మణీయం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

చరిత్రలో వడ్డే ఓబన్న జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు ఏలూరు జిల్లా కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శనివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చరిత్రలో వడ్డే ఓబన్న జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. వీరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. వడ్డే ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆనాడు ఓబన్న బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం చేసిన పోరాటంలో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. పేద రైతుల హక్కులను కాపాడడానికి, ముఖ్యంగా రైతులపై అధిక పన్నులు విధించడం పట్ల బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన యోధుడన్నారు. వడ్డే ఓబన్న ప్రజలు, రైతుల కోసం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన త్యాగం, దేశభక్తి, ధైర్యం ప్రజల హృదయాలో నిలిచిపోయిందని ఆయన జాతికి చేసిన సేవలు మరువరానివని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి నాగరాణి, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, పశుసంవర్ధ శాఖ జాయింట్ డైరెక్టర్ గోవిందరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాంచారయ్య పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

వైద్యుల కొరతపై హెచ్‌డిఎస్ కమిటీలో చర్చించాం

ఏలూరు సర్వజన ఆస్పత్రి అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ కోసం ఏలూరు గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపల్ వారికి తెలియపరిచామని, దీనిపై 2024 అక్టోబర్ 24వ తేదీన జరిగిన హెచ్‌డిఎస్ కమిటీ మీటింగ్‌లో కమిటీ ఛైర్మన్ కలెక్టర్, కమిటీ సభ్యులు ఏలూరు ఎంపీ, కమిటీ వైస్ ఛైర్మన్ ఏలూరు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లామని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తెలిపారు. శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వైద్యులు నిల్.. రోగులు ఫుల్ అనే కథనానికి ఆసుపత్రి అధికారులు స్పందించారు. నోట్ రూపంలో వివరణ ఇచ్చారు. వైద్యుల కొరతపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విజయవాడ వారికి తెలియపరిచినట్లు తెలిపారు. క్యాజువాలిటీలో సిఎఎస్, సిఎంఒ డాక్టర్ల కొరత ఉండటం వల్ల వైద్యులను డిప్యూట్ చేయాల్సిందిగా డిఎంహెచ్‌ఒను కోరినట్లు వివరించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుంది. వైద్యుల కొరత ఉండటం వల్ల ఉన్న వైద్యుల మీద పనిభారం అధికంగా ఉన్నప్పటికీ రోగులకు ఆసౌకర్యం కలుగకుండా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

సమ్మె కాలపు హామీలను అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

2024లో రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం జిఒ రూపంలో విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. నిరసన శిబిరాన్ని యూనియన్ కార్యదర్శి టి.విజయరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, జిఒ 36 ప్రకారం రూ.21 వేతనం ఇవ్వాలని, ప్రమాద ఎక్స్‌గ్రేషియో అమల చేయాలని, 62 ఏళ్లకు సర్వీసును పెంచాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికే దఫాదఫాలుగా ఆందోళన కార్యక్రమం చేపట్టామని, సమస్యలు పరిష్కరించకపోతే రానున్నకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ నిరసనకు వివిధ పార్టీల నాయకులు, వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సంబరాలు సరే.. పందేల మాటేంటి..!

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా సాంప్రదాయం పేరుతో సంక్రాంతి సంబరాలు రెండు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రధానంగా విద్యాసంస్థల్లో ప్రారంభించిన సంక్రాంతి సంబరాలు పలు పట్టణాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోనూ కొనసాగాయి. అదే సమయంలో పలువురు ఎంఎల్‌ఎలు, అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలోనూ సంక్రాంతి సంబరాలను కనులవిందుగా నిర్వహించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా కనుమరగవుతున్న హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు ఇలా చెప్పుకుంటూ పోతే మానసికోల్లాసం కలిగించే పలు అంశాలు ఈ సంబరాల్లో భాగంగా దర్శనమిచ్చాయి. చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణ, నృత్యాలు, కళాప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక భోగిమంటల నుంచి ముగ్గుల పోటీ వరకు అందరినీ అలరించాయి. ఈ సంబరాల్లో జిల్లా అధికారులు సైతం భాగస్వామ్యులయ్యారు. అయితే సంక్రాంతి విశిష్టత సంప్రదాయాల గురించి తప్ప కోడిపందేల గురించి నేతలెవ్వరూ ఉలుకుపలుకు లేకుండా ఉండడం చర్చనీయాంశమైంది. అదే సమయంలో జిల్లా అధికారులు ప్రధానంగా కలెక్టర్, ఎస్‌పి రెండు జిల్లాలోనూ ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేల నిర్వహణను అడ్డుకుని తీరుతామని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు మండల, గ్రామస్థాయిలో కూడా పందేల నిర్వహణను అడ్డుకునేందుకు కమిటీలను సైతం ఏర్పాటు చేసి రంగంలోకి దించారు. రెండు జిల్లాల్లోనూ గతంలో మాదిరిగానే పలుచోట్ల బరులు ధ్వంసం చేసినట్లు అధికారులు ఘంటాపథంగా ప్రకటించారు. దీంతో పాటు పలుచోట్ల పందేలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీల ఏర్పాటు చేయడంతో పాటు పందేలు నిర్వహిస్తే సంబంధిత స్థల యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. ఇవన్నీ చూస్తే ఇంకెముంది హైకోర్టు ఆదేశాల మేరకు పందేలు రెండు జిల్లాలోనూ జరగవని జనం అనుకుంటారు. అయితే ఈ ఘీంకారాలు, కమిటీలు సంక్రాంతి ప్రారంభం రోజైన భోగి నుంచి ముక్కనుమ వరకూ నాలుగు రోజులు ఏ మేరకు పనిచేస్తాయో వేచి చూడాలి. ఎందుకంటే ఆ నాలుగు రోజులు జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు పత్తా లేకుండా పోవడంతో పాటు ఫోన్లు కూడా పనిచేయని పరిస్థితి చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. ప్రధానంగా భోగి రోజు ఉదయం డింకి పందేల పేరిట అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కోళ్లకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. ఇదేమంటే సాంప్రదాయమని, కత్తులు కట్టడంలేదు కదా అని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ డింకి పందేలు ప్రారంభించిన గంట తర్వాత పందెంరాయుళ్ల జూలు విదిల్చి యథేచ్ఛగా కోడిపందేలు సాగించడం సర్వసాధారణంగా మారింది. ఆ బరుల వద్ద మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నా పట్టించుకునే నాధుడే ఉండడు. గుండాట, పేకాట వంటివి అడ్డూఅదుపు ఉండని పరిస్థితి. మరి ఈ సంక్రాంతి ఎప్పటిలానే పందేల సంక్రాంతిగా మిగిలుతుందా లేక హైకోర్టు ఆదేశాల మేరకు ప్రజాసంక్రాంతిగా నిలుస్తుందో వేచి చూడాలి.



ఏజెన్సీలోని ఐదు మండలాల్లో పీసా కమిటీ ఎన్నికలు చాలావరకు పూర్తయ్యాయి. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడుల్లో పీసా కమిటీ ఎన్నికలు ఎక్కడా అల్లర్లకు, తగాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా సాగడం విశేషం. పలుచోట్ల కమిటీల ఎన్నిక ఏకగ్రీవమవ్వగా మరికొన్నిచోట్ల ఎన్నికలు జరిగినా ప్రశాంతంగానే ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వడం గిరిజనుల చైతన్యానికి నిదర్శనం. ఎక్కడైనా ఎన్నికలు నిలిచినా, తగాదాలు తలెత్తినా ప్రధాన కారణం ప్రభుత్వం, అధికారుల అనాలోచిత చర్యల ఫలితమే అని చెప్పొచ్చు. కొన్నిచోట్ల నిర్వాసిత కాలనీలను నిర్మించినా అక్కడ ప్రత్యేకంగా పీసా కమిటీ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా సమీప గ్రామ కమిటీలోనే కలపడంతో వివాదాలు తలెత్తాయి. మరికొన్నిచోట్ల ప్రచారం సరిగా లేక ఫోరం లేక ఎన్నిక నిలిచిపోయింది. ఎన్నికలు నిర్వహించిన అధికారులు నిలిచిపోయిన కమిటీల ఎన్నికలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో పీసా కమిటీలు సమర్ధవంతంగా నడిచేలా జిల్లా, మండల అధికారులు సహకరించాల్సిన అవసరం ఉంది.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, ప్రజా, కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానిస్తూ, అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను ఆ పదవి నుంచి తొలగించాలని దళిత, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అధ్యక్షత వహించారు. దళిత సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ చాగంటి సంజీవయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్ నాయకులు బి.సోమయ్య తదితరులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మత విద్వేషాలు రెచ్చగొడుతూ మనువాదాన్ని ముందుకి తీసుకొచ్చే ఆలోచనలు చేస్తుందన్నారు. దాంట్లో భాగంగా అంబేద్కర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయిస్తుందని విమర్శించారు. రాజ్యాంగం పట్ల, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్ర మంత్రి అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించాలని, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే భారత ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, సిఐటియు జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి
www.prajasakti.com

పాడి రైతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - భీమడోలు

పాడి రైతుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సేవలను వినియోగించుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, జెడ్పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డిగూడెం ఆవాస ప్రాంతంలో పాడి రైతుకు మంజూరైన మినీ గోకులం యూనిట్‌ను వారు శనివారం ప్రారంభించారు. రూ.2.30 లక్షల వ్యయం, సుమారు 90 శాతం రాయితీతో ఆరు గేదెలు ఉన్న యూనిట్ పనితీరును వారు పరిశీలించారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో అవగాహనా ర్యాలీ

మండలంలోని రాళ్ల కుంట గ్రామపంచాయతీ పరిధిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విఆర్ఒ సిలార్ హెచ్చరించారు. విఆర్ఒ ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహించకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గ్రామ పరిధిలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

ముసునూరు : సాంప్రదాయమే ముద్దు జూదాలు వద్దు అంటూ ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదం, పేకాట, గుండాట ఆటలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ జి.పురుషోత్తమ శర్మ, ఎంపిపి కొండా దుర్గాభవాని, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన పాల్గొన్నారు.

'కుమ్మగూడెంలో పీసా ఎన్నికలను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - పోలవరం

ఇటీవల మండలంలోని కొమ్ముగూడెంలో జరిగిన పీసా ఎన్నికల్లో అధికారులు ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించారని బోడిగూడెం గిరిజన గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా బోడిగూడెంలో 200 మంది గిరిజనులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచి కొక్కెర వెంకటలక్ష్మి, గ్రామస్తులు సున్నం ప్రసాద్ మాట్లాడుతూ 33 తెగల్ని అదనంగా ఎస్‌టిల్లో కలిపి నిజమైన గిరిజనులకు గిరిజన ఫలాలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీసా ఎన్నికల నిర్వహణలో ఆదివాసీ చట్టాలు తెలిసిన అధికారులను నియమించాలని నిజమైన కోయ, ఆదివాసీ, కొండరెడ్లను మాత్రమే గిరిజనులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజం రామారావు, కుంజం నాగేశ్వరరావు, కలుం సుబ్బారావు, మడకం గణేష్, కుంజం నాగేంద్రకుమార్, కొత్తం మోహన్‌రావు, సున్నం వెంకటేశ్వరరావు, సున్నం గంగారత్నం పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - చింతలపూడి

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని బోయగూడెం నుంచి, మార్కెట్ యార్డు వరకు అలంకరణ చేసిన ట్రాక్టర్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.1800 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. భూ సేకరణ చేస్తామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందన్నారు. సంస్కృతిని గౌరవించాలని, అందుకే రైతులతో ట్రాక్టర్ షో నిర్వహించామని తెలిపారు.

'చంద్రబాబు, పవన్‌లపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లపై మాజీ మంత్రి రోజా విమర్శలు చేయడం సరికాదని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘలాదేవి అన్నారు. ఆమె నివాసం వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబును, పవన్‌ను విమర్శించే స్థాయి రోజాకు లేదన్నారు. తిరుపతిలో 11 మంది ఆక్సిజన్ లేక చనిపోతే ప్రశ్నించిన వారిని అన్యాయంగా అరెస్టు చేయడం మీకే సాధ్యమన్నారు. ఎల్‌జి పాలిమర్స్ విషవాయువు పీల్చి 13 మంది చనిపోయిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం వల్ల జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి 27 మంది చనిపోయిన దానికి ఏం సమాధానం చెప్పారన్నారు.

వైసిపి మండలాధ్యక్షునిగా రామరాజు

ప్రజాశక్తి - ముదినేపల్లి


రామరాజు

వైసిపి ముదినేపల్లి మండలాధ్యక్షునిగా బోయిన రామరాజు నియమితులయ్యారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామ సర్పంచి బోయిన విమల భర్త రామరాజును పార్టీ మండలాధ్యక్షునిగా కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శనివారం నియమించారు. ఇప్పటివరకు పార్టీ మండలాధ్యక్షునిగా మండలంలోని గురజ గ్రామానికి చెందిన మోట్రూ ఏసుబాబు కొనసాగారు. రామరాజును పార్టీ మండలాధ్యక్షునిగా నియమించడం పట్ల మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మినుము పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోట గ్రామంలో ఉన్న మినుము పంట పొలాలను జనసేన నాయకులు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ శనివారం ఇరిగేషన్ డిఇ శిరీషతో కలిసి పరిశీలించారు. ముందుగా రైతులు తమ పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు పడుతున్న ఇబ్బందులను జయమంగళ వెంకటరమణకు వివరించారు. ఈ సందర్భంగా జయమంగళ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పంట పొలాలు ఒక్క ఎకరం కూడా ఎండకుండా సకాలంలో నీరందించి రైతులను ఆదుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు మినుము పంట నష్టపోకుండా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

కోడి కత్తుల తయారీదారుడు అరెస్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కోడి పందేల కోసం కత్తులు తయారు చేసి సానపడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 1300 కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. చేబ్రోలు పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గణపవరం పోలీసు స్టేషన్ పరిధి చిన రామచంద్రపురంలో ముసినాని బ్రహ్మానందం కోడి కత్తులను సిద్ధం చేసి వాటికి లేత్ మిషన్‌పై పదును పెడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఎ.మణికుమార్ శనివారం దాడిచేసి పట్టుకున్నారన్నారు. అతని వద్ద నుంచి 1300 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏలూరు డివిజన్‌లో ఇప్పటివరకు బైండోవర్ కేసులు నమోదు చేసి 11 బరులను ధ్వంసం చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. సంప్రదాయ సంక్రాంతిని సంతోషాలతో జరుపుకోవాలని జూదం, వ్యసనాలతో ప్రమాదాల బారిన పడి దు:ఖంలో మునిగిపోవద్దని పిలుపునిచ్చారు. నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ పాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కుక్కునూరు సిఐ ఎం.రమేష్‌బాబు ఆధ్వర్యంలో వారి సిబ్బంది సహకారంతో పోలీస్ స్టేషన్ల పరిధిలో కివ్వాక, వేలేరు గ్రామాల వద్ద కోడిపందేల బరులను పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కుక్కునూరు సిఐ మాట్లాడుతూ ఎవరైనా కోడికత్తులు కలిగి ఉన్నా , బరులను సిద్ధం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేలేరు గ్రామంలో కస్తూరిబా స్కూల్ వెనుక కొండపై నాటుసారా స్థావరంపై శనివారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 500 లీటర్ల బెల్లపు ఊట, పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గిరిజన మహిళపై దాడి దారుణం

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ధర్నా చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన మహిళ మడకపాటి అనూషపై దౌర్జన్యం చేసి దాడి చేసిన బుట్టాయగూడెం తహశీల్దార్ చలపతిరావు, విఆర్ఒ పోతురాజు, బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గామహేశ్వరరావులపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. తొలుత బుట్టాయగూడెం బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గిరిజన మహిళపై దౌర్జన్యం చేసి దాడి చేసిన తహశీల్దార్, ఎస్ఐలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, గిరిజన చట్టాలను, గిరిజనులను రక్షించాల్సిన అధికారులే గిరిజనులపై దాడి చేస్తున్నారని నినాదాలు చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బుట్టాయగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 550/4.550/5.550/6లో 2.50 ఎకరాల ప్రభుత్వ పుంత పోరంబోకు భూమిలో పోరాటం ద్వారా ఇచ్చిన ఇళ్లస్థలాల్లో గిరిజనులు ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. శుక్రవారం సాయంత్రం విఆర్ఒ, పోలీసు సిబ్బందితో వచ్చిన తహశీల్దార్ గిరిజన మహిళపై దౌర్జన్యం చేశారన్నారు. ఎస్ఐ, తహశీల్దార్ దుర్భసలాడుతూ మహిళను కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన అధికారులే ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. భూమిని ఆక్రమించి ఉంటే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాల్సింది పోయి మహిళపై దౌర్జన్యం చేసి చేయి పట్టుకొని లాగేసి కులం పేరుతో దూషించడం సరికాదన్నారు. బుట్టాయగూడెం ఎస్ఐను, తహశీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సర్వే నెంబరు 550/4,5,6 (ప్రభుత్వ పుంత పోరంబోకు) అని రికార్డులో నమోదై ఉంటే కాదని వాదన చేస్తున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమా కాదా తేల్చాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని, ఏజెన్సీ ప్రాంత చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తహశీల్దారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, గిరిజన సంఘం నాయకులు నాగేశ్వరరావు, శేఖర్, పోడియం గంగరాజు, కారం ముత్యాలరావు, నాగమణి, చంద్రు బుల్లమ్మ, కొమరం సత్యనారాయణ, సోమరాజు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాలలో...

స్థానిక ఎన్ఆర్ఐ కళాశాలల గ్రౌండ్స్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ముగ్గులపోటీలు, భోగిమంటలు, భోగికుండలు, హరిదాసుల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడిపుంజులతో విన్యాసాలు, విద్యార్థులతో కోలాటాల ప్రదర్శన, వివిధ రకాల సాంప్రదాయ పిండి వంటల ప్రదర్శన, చిన్నారులకు భోగి పండ్లు, విద్యార్థుల ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతో ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో విజేతలకు కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వి.తులసీరామ్ మాట్లాడుతూ విద్యార్థులకు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి పలు రకాల పిండి వంటలతో సాంప్రదాయ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, పి.సురేష్, సిహెచ్.శివకుమార్, సిహెచ్ ఎన్‌వి.సత్యనారాయణ, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ విభాగ అధిపతులు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎన్.రామాంజనేయులు, జె.నాగరాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సంక్రాంతి సంబరాలను కొయ్యలగూడెం, కన్నాపురం, బయ్యనగూడెం, రాజవరం గ్రామాల్లో ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణాలతో పాటు ప్రయివేట్ విద్యాలయాల్లో, కళాశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో ముందస్తు భోగి మంటలను వెలిగించి కోలాటం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు గోదారంగనాధుని కళ్యాణాన్ని నిర్వహించి ఆకట్టుకున్నారు. టెంపుల్స్ సెంటర్ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారు.

శ్రీరామ్‌నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద ముగ్గుల పోటీ కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో కీర్తిశేషులు సింగు దాసు సీతారామయ్య, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 85 మందికిపైగా యువతులు, మహిళలు పాల్గొని సందేశాత్మక ఆకర్షణీయమైన సాంప్రదాయ ముగ్గులను వేశారు. వీరికి సింగు దాసు సత్యానా రాయణ, సింగు దాసు నాగేశ్వరరావు సోదరులు రూ.25 వేల విలువైన బహుమతులను అందించారు. ప్రత్యేక బహుమతులను వాసవి గ్రాఫిక్స్ సుధాకర్, ఆంధ్రా బ్యాంకు ఉద్యోగి ఫకీర్ బాబు అందించారు. విజేతలుగా నిలిచిన వారితో పాటు పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు.

కుక్కునూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కుక్కునూరు కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న రంగోలి ముగ్గుల పోటీ మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని సిపిఎం మండల కార్యదర్శి శ్రీను తెలిపారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంపీ మహేష్, ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. గొల్లగూడెం గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేయగా రూ.90 లక్షల నిధులతో 1250 మీటర్ల మేర సీసీ రోడ్లను నిర్మించారు. వాటిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారుల నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, సర్పంచి కరపా వెంకట శ్రీనివాసరావు, నాయకులు వేములపల్లి సుధీర్, ఎంపిటిసి సభ్యులు మంగేష్, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి చర్యలు

సీసీ కెమెరాల వ్యవస్థ ప్రారంభం

భీమడోలు: భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి, పర్యావరణ పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు, నిర్మానుషంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద మద్యం తాగడం, ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలను అరికట్టేందుకు భీమడోలు గ్రామ సర్పంచి పి.సునీతమాన్సింగ్ ఆధ్వర్యంలోని పంచాయతీ పాలకవర్గం, గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ చేపట్టిన వినూత్న కార్యక్రమం పలువురి మన్ననలను పొందింది. ఈ మేరకు గ్రామపంచాయతీ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారానికి ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ వ్యవస్థను శనివారం భీమడోలు గ్రామ పర్యటనకు వచ్చిన ఏలూరు ఎంపీ మహేష్, జెడ్పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. పంచాయతీ సిబ్బందికి సంక్రాంతి సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు.

'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సిఎం సత్కరించాలి'

ప్రజాశక్తి - దెందులూరు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఉపఎన్నిక కారణంగా ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 26 మందిని సిఎం చేతులమీదుగా సత్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్‌రావు కోరారు. గతేడాది నవంబర్ 11వ తేదీన విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ఈ రెండు జిల్లాల వారికి అవార్డుల ప్రదానం వాయిదా పడింది. ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని సంబంధిత జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల ద్వారా అందించేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులను ఈ నెల పదో తేదీన విడుదల చేశారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని ఈ నెల 26 రిపబ్లిక్ డే నాడు సిఎం చేతులమీదుగా పురస్కారాలు అందించాలని కోరారు.

సోమయ్య మృతి బాధాకరం

ఆగిరిపల్లి : టిడిపికి ఎన్నో ఏళ్లుగా ఎనలేని సేవలందించి, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి బడుగు సోమయ్య అని, ఆయన మృతి బాధాకరమని రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సోమయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామంలోని బడుగు సోమయ్య ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సోమయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

భీమడోలు : భీమడోలు శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి శాశ్వత ప్రాతిపదికన స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. 1986లో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేర భీమడోలు కేంద్రంగా లైబ్రరీ ప్రారంభమైంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వం కేటాయించే అరకొర అద్దెనిధులతో గ్రంథాలయం పలు అద్దె భవనాలకు మారాల్సి వచ్చింది. దీంతో సందర్శకులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఒత్తిడి, చొరవతో భీమడోలు గ్రామపంచాయతీ సర్వే నెంబర్ 78/1లో ఏడు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ 88/2004 సంఖ్యతో తీర్మానం చేసింది. దీంతో గ్రంథాలయాన్ని నిర్మించుకోవచ్చని తెలిపింది. కాని జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రామపంచాయతీ కేటాయించిన స్థలాన్ని సంస్థ పేర రిజిస్ట్రేషన్ చేయాలని, ఆ తరువాతే నిధులు కేటాయింపు చేస్తామని అభ్యంతరం తెలిపింది. దీనిపై గ్రామపంచాయతీ ఆస్తులను ఇతర సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసేందుకు తమకు అనుమతులు లేవంటూ తెలిపారు. పంచాయతీ తీర్మానం ఆధారంగా గ్రంథాలయ భవన నిర్మాణాన్ని చేపట్టుకోవచ్చని మౌఖికంగా తెలిపారు. ఇదే విషయమై గ్రామపంచాయతీ, జిల్లా గ్రంథాలయ సంస్థ తమ పట్టు వీడకపోవటంతో గ్రంథాలయ భవన నిర్మాణంలో ప్రతిస్తంభన ఏర్పడింది. సంవత్సరాలు గడుస్తున్న చిక్కుముడి వీడలేదు. దీంతో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం భీమడోలు పర్యటనకు వచ్చిన ఎంపీతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు వినతి పత్రాన్ని సమర్పించారు. .

ఉచిత వైద్య శిబిరం సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామీణ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపు సేవలను వినియోగించుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వేదికగా, ప్రముఖ కార్పొరేట్ వైద్యశాల ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సూచనల మేరకు ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపు ఆయన జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజులతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు వారందరూ మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది భాగస్వామ్యంతో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో పాల్గొన్నారు.

మానస విద్యార్థుల వితరణ అభినందనీయం

ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమడోలుకు చెందిన కార్మికురాలు పతివాడ అనసూయ రెండు కాళ్లను కోల్పోయి వికలాంగురాలిగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో స్పందించిన భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు కరస్పాండెంట్ పర్యవేక్షణలో పోగు చేసిన రూ.50 వేలను శనివారం బాధిత మహిళకు అందించారు. ఎంపీ పుట్టా మహేష్ రూ.పది వేలు అందించారు.

నూజివీడులో ఉచిత వైద్య శిబిరం

నూజివీడు టౌన్ : పట్టణ పరిధిలోని బాపు నగర్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద శనివారం ఆకుల రామదాసు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. నేత్ర సంబంధ వ్యాధులు, షుగర్, బిపి, ఇతర వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సామాజికవేత్త ఆకుల పవన్‌కుమార్ మాట్లాడుతూ తన తాత ఆకుల రామదాసు ఆశయ సాధనలో భాగంగా తన తండ్రి ఆంజనేయ ప్రసాద్, పెదనాన్న భీమశంకర్‌రావుల సహకారంతో పేదలకు ఉచిత వైద్య సేవలందించినట్లు చెప్పారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు వారి కోర్టులో

O.S. No. 516/2014

Between:

ఎస్.ఎస్.వి.రామ సత్యనారాయణ -వాది

మరియు

శెట్టి మీనాక్షి, వగైరాలు -ప్రతివాదులు

శెట్టి అరుణ్ సాయి -3వ ప్రతివాది

3వ ప్రతివాది: శెట్టి అరుణ్‌సాయి, S/o. లేటు శ్రీనివాసు, వయస్సు 22 సం॥లు, హిందూ, R/o. D.No. 13-5-3/1, గుంటువారి వీధి, నల్లవారి వీధి ఎదురుగా, వెంకటరామ థియేటర్ దగ్గర, పాతూరు, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన శ్రీ శెట్టి అరుణ్‌సాయి కి రిజిస్టర్ పోస్ట్ మరియు కోర్టు వారి ద్వారా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా ది. 24-01-2025వ తేదీన వాయిదా అయి ఉన్నదని, ఆరోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ శెట్టి అరుణ్‌సాయి స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు వారి కోర్టు నందు హాజరు కావలసి ఉన్నదని, అలా కాని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

పి.సూర్యనారాయణ, న్యాయవాది
నిడదవోలు, సెల్: 98496 82517

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు, కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా

S.O.P. No. 6/2024

Between:

1. Sri Gudimetla Ananda Rao and Others ...Petitioners

AND

Union Bank of India, Lakkavaram Branch ...Respondent

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు S.O.P. 6/2024 పిటిషనర్స్‌కి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు పిటిషనర్స్‌కి దాఖలు పడినవి. సదరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అభ్యంతరము మేరకు పై పిటిషనర్స్ వారసురాలు అని సక్సెషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం సక్సెషన్ O.P. దాఖలు చేసియున్నారు. పై నెంబరు S.O.P. ది. 30-1-2025న వాయిదా అయి ఉన్నది. యిందు విషయమై ఎవరికైన ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట ది. 30-1-2025 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు మరియు అభ్యంతరములు తెలియపర్చు కొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానం జరుగును.

PETITION SCHEDULE FILED BY THE PETITIONERS

ITEM NO.1:

Eluru District Previously called as west Godavari District, Jangareddigudem Mandal, Jangareddigudem SRO. In the village of Lakkavaram a land an extent of AC. 3.08 cents of dry land in R.S. No. 490 bounded on:

EAST: The remaining land of petitioners. **SOUTH:** Land of Undavalli Ramarao and Gudimetla Chandra Sekhara Rao. **WEST:** Yerra Kalava. **NORTH:** Land of Uppala Aparna and other.

Within these boundaries an extent of Ac. 3.08 cents of dry land in R.S. No. 490 of Lakkavaram Village within with all easementary rights.

ITEM NO.2:

Eluru District Previously called west Godavari District, Jangareddigudem Mandal, Jangareddigudem SRO. In the village of Lakkavaram a land an extent of 153 Sq. Yards of site and terraced building bearing D. No. 3-82 in assessment No. 418 is bounded on:

EAST: Panchayathi Road. **SOUTH:** House of Patti Veeraswami. **WEST:** House of Kalapala Venkatarao. **NORTH:** House of Vandanapu Balakrishna.

Within these boundaries an extent of 153 Sq. Yards of site and terraced building of Lakkavaram Village within with all easementary rights.

కొండాబత్తుల నరసింహారావు
అడ్వకేట్
కొవ్వూరు
11-1-2025
కొవ్వూరు

బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

నూజివీడు టౌన్: పట్టణంలోని డిఎఆర్ కళాశాల ఆవరణలో శనివారం 48వ మెమోరియల్ ఆంధ్ర, తెలంగాణ ఫ్లడ్‌లైట్ ఓపెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 36 పురుష, 14 మహిళల జట్లు తలపడనున్నాయి.

మహారాజశ్రీ VII Addi జిల్లా జడ్జి Family Court ఏలూరు, ప॥గో॥జిల్లా

I.A. No. 225/2024 In
A.S. No. 13/2020

Between:

శ్రీమతి అల్లు జయలక్ష్మి ...Petitioner /Appellant

AND

కర్పూరం స్వరాజ్యలక్ష్మి (Died) and Others ...Respondents /Respondents

పై నెంబరు గ్రంధములో కర్పూరం స్వరాజ్యలక్ష్మి మరణించినందు వలన ఆమె వారసులైన 3, మరియు 4 ప్రతివాదులుగా మిమ్మల్ని అనగా (R3) కర్పూరం నైమిష D/o సత్యనారాయణ R/o D.No. 7D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువల రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు (R4) కర్పూరం హిందుజ D/o సత్యనారాయణ R/o D.No. D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువల రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు వార్లకు నోటీసు అమలు నిమిత్తం ది. 31-01-2025 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున దావా సంగతులు తీర్మానించబడును.

కానాల రామకృష్ణారావు
ఏలూరు అడ్వకేట్,
11-01-2025 ఏలూరు
సెల్: 9390004053

మహారాజశ్రీ VII Addi జిల్లా జడ్జి Family Court ఏలూరు, ప॥గో॥జిల్లా

I.A. No. 224/2024 In
A.S. No. 13/2020

Between:

శ్రీమతి అల్లు జయలక్ష్మి ...Petitioner /Appellant

AND

కర్పూరం స్వరాజ్యలక్ష్మి (Died) and Others ...Respondents /Respondents

పై నెంబరు గ్రంధములో కర్పూరం స్వరాజ్యలక్ష్మి మరణించినందు వలన ఆమె వారసులైన 3, మరియు 4 ప్రతివాదులుగా మిమ్మల్ని అనగా (R3) కర్పూరం నైమిష D/o సత్యనారాయణ R/o D.No. 7D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువల రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు (R4) కర్పూరం హిందుజ D/o సత్యనారాయణ R/o D.No. D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువల రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు వార్లకు నోటీసు అమలు నిమిత్తం ది. 31-01-2025 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున దావా సంగతులు తీర్మానించబడును.

కానాల రామకృష్ణారావు
ఏలూరు అడ్వకేట్,
11-01-2025 ఏలూరు
సెల్: 9390004053

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి వారి కోర్టులో, పాలకొల్లు

I.A. No. 319/2024 In
I.A. No. 46/2023 In
O.S. No. 35/2023

బిట్వీన్:

పొట్నూరి సత్య కిషోర్ -పిటీషనరు/వాది

మరియు

వేంద్రపు లక్ష్మణరావు (లేటు) మరియు అనదర్స్ రెస్పాండెంట్లు -ప్రతివాది

టు:

2: వేంద్రపు సత్యనారాయణ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేంద్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

2వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

3: వేంద్రపు తేజ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేంద్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

3వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

పై నెంబరు పిటిషను గ్రంధములో రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందుకొనకుండా కావాలనే ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచూ ఉన్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ది. 23-01-2025 వ తేదీన పై కేసు విషయమై శ్రీయుత కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10 గం॥కు లగాయితూ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)

యమ్. నాగపల్లవి
పిటీషనరు తరుపు న్యాయవాది
పాలకొల్లు
సెల్: 9492484235

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి వారి కోర్టులో, పాలకొల్లు

I.A. No. 318/2024 In
O.S. No. 35/2023

బిట్వీన్:

పొట్నూరి సత్య కిషోర్ -పిటీషనరు/వాది

మరియు

వేంద్రపు లక్ష్మణరావు (లేటు) మరియు అనదర్స్ రెస్పాండెంట్లు -ప్రతివాది

టు:

2: వేంద్రపు సత్యనారాయణ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేంద్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

2వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

3: వేంద్రపు తేజ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేంద్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

3వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

పై నెంబరు పిటిషను గ్రంధములో రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందుకొనకుండా కావాలనే ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచూ ఉన్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ది. 23-01-2025 వ తేదీన పై కేసు విషయమై శ్రీయుత కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10 గం॥కు లగాయితూ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)

యమ్. నాగపల్లవి
పిటీషనరు తరుపు న్యాయవాది
పాలకొల్లు
సెల్: 9492484235